సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 24 । నవంబర్ । 2023



ఘనంగా గణపతి హోమం

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా యజ్ఞశాలలో వేదపండితుల మంత్రోచ్ఛారణాలతో గణపతి హోమం నిర్వహించారు.



కార్తీక సందడి

సుల్తానాబాద్: కార్తీక మాసం సందర్భంగా స్థానిక శివాలయంలో గురువారం వేకువ జామున భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 33 జ్యోతులు వెలిగించారు.

గరిష్టం/కనిష్టం
32.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఖనికి సీఎం కేసీఆర్



గోదావరిఖని: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం గోదావరిఖనిలో జరిగే ఎన్నికల బహిరంగ సభలో పాల్గొననున్నారు. స్థానిక సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రజాఆశీర్వాద బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈమేరకు స్టేడియంలో ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత సీఎం కేసీఆర్.. మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారు. ఆ తర్వాత రామగుండంలో జరిగే బహిరంగ సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. ఈమేరకు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసు బలగాలను మోహరించారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రాజేశ్‌సింగ్ రాణా, అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): మన రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని రామగుండం ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా సూచించారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు గురువారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈనెల 30న అర్హులందరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. మద్యం, డబ్బు తదితర ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో నియోజకవర్గంలో 71శాతం పోలింగ్ నమోదైందని, ముఖ్యంగా ఎన్టీపీసీ పోలింగ్ కేంద్రంలో తక్కువ మంది ఓటర్లు ఓటు వేశారని, ఈసారి పోలింగ్ శాతం పెంచాలని సూచించారు. అనంతరం కళాజాత ఓటు ప్రాధాన్యతపై ఆట, పాటలతో కార్మికులను చైతన్యపరిచారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, ఎన్నికల అధికారులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: స్థానిక బాలుర జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం జిల్లాస్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. బాలికల కబడ్డీ జట్టు ఎంపిక కోసం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారని అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి తోట శంకర్, కోశాధికారి వైద కిష్టయ్య తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులు నిజామాబాద్‌లో డిసెంబర్ 4వ తేదీ నుంచి ఆరో తేదీవరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా నుంచి సంధ్య, సాహిత్య, కుసుమ, శ్రీహిత, కీర్తన, అఖిల, జాహ్నవి, గాయత్రి, శ్వేత, రూపప్రియ, సౌమ్య, అక్షర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వారు వివరించారు.

కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్



పతకంతో అమృత్‌సాయి

గోదావరిఖనిటౌన్: స్థానిక సాక్రెడ్ హార్ట్ పాఠశాల విద్యార్థి ఎం.అమృత్‌సాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇటీవల కరీంనగర్‌లో ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. అమృత్‌సాయి ఇందులో ప్రతిభ కనబర్చి బంగారు పతకంతోపాటు నగదు బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం కరస్పాండెంట్ లవ్‌లీ జాకబ్, ప్రిన్సిపల్ జ్యోత్స్న, ఇన్నమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

పత్తి ధర రూ.6,822

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.6,822, కనిష్టంగా రూ.5,811 ధర పలుకగా.. సగటు ధర రూ.6,711గా నమోదైందని మార్కెట్ కమిటీ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరా జ్పృథ్వీరాజ్ తెలిపారు. రైతులు నాణ్యమైన పత్తి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు.

ఇంటి వద్దే పోలింగ్

- చురుగ్గా సాగుతున్న ప్రక్రియ
- దివ్యాంగులు, వయోవృద్ధులకు మంచి అవకాశం
- ఎన్నికల కమిషన్ చరిత్రలో తొలిసారి
- ఆసక్తి చూపుతున్న ఓటర్లు
- జిల్లాలో 1,104 మంది దరఖాస్తు



ఇంటి వద్ద ఓటు ప్రక్రియ పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్(ఫైల్)

పెద్దపల్లిరూరల్: ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతోవిలువైనది. ఓటుహక్కును అందరూ వినియోగించుకునేలా చూసి పోలింగ్ శాతం పెంచాలనే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈసారి ఓటుహక్కు వినియోగించుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్న దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. తొలిసారి ఈ అవకాశాన్ని కల్పించిన అధికారుల ఆలోచన పోలింగ్ శాతం పెంచేందుకు దోహదం చేస్తోందని భావిస్తున్నారు.

578మంది వయోవృద్ధుల నమోదు..

జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల పరిధిలో 578మంది వయోవృద్ధులు ఇంటినుంచి ఓటు వేసేందుకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఇప్పటిదాకా 536మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటేయకుండానే 11మంది..

- ఓటు వేయాలనే తపనతో పేర్లు నమోదు చేసుకున్న 11మంది వయోవృద్ధులు చివరి ఓటు వేయకుండానే తనువు చాలించినట్లు అధికారుల దృష్టికి వచ్చింది.
- పేర్లు నమోదు చేసుకున్న వారిఇళ్లకు పోలింగ్ అధికారులు ఓటు సేకరించేందుకు వెళ్లగా వారు మరణించినట్లు తెలుసుకుని వెనుదిరిగారు. మిగతా వారిలో కొందరు వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో చేరినట్లు సమాచారం.

477మంది దివ్యాంగులు..

జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల పరిధిలో 477మంది దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు వేసేందుకు తమపేర్లను నమోదు చేసుకున్నారు. అందులో 439 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

అత్యవసర ఉద్యోగులు 49మంది

జిల్లాలోని అత్యవసర విభాగాల్లో పనిచేసే 49మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వారంతా ఆయా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఓటుహక్కును వినయోగించుకుంటారు.

జిల్లా సమాచారం..

నియోజకవర్గం	వృద్ధులు	దివ్యాంగులు	ఉద్యోగులు
పెద్దపల్లి	366	256	18
రామగుండం	147	184	22
మంథని	65	37	09

పోలింగ్ శాతం పెంచేలా..

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేందుకు వీలుగా ఎన్నికల సంఘం తొలిసారి వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. ఈ నిర్ణయం మంచి ఫలితాలనే ఇచ్చింది. అత్యవసరసేవల్లో పనిచేసే అధికారులు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఓటుహక్కు వినయోగించుకోవాల్సి ఉంటుంది.

– మధుమోహన్, రిటర్నింగ్ అధికారి

ఇంటి వద్ద ఓటేసిన 95 మంది ఓటర్లు

మంథని: మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని పది మండలాల నుంచి పోస్టర్ బ్యాలెట్ (ఫారం–12డి) ద్వారా ఇంటి నుంచి 95 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్ గురువారం తెలిపారు. నియోజకవర్గంలో 65 మంది వృద్ధులు, 37 మందివికలాంగులు, అత్యవసర సేవల విభాగం నుంచి 9 ఇలా 111 మంది ఇంటి నుంచి ఓటు వేసేందేకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో 22, 23వ తేదీల్లో 62 మంది వృద్ధులు, 33 మంది వికలాంగులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టర్ బ్యాలెట్ ద్వారా ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటు హక్కును నిర్ణీత నమూనా ద్వారా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఆదాయపు పన్ను రద్దు చేయండి

- మారుపేర్లలో మార్పు చేయాలి
- సొంతింటికి జాగా ఇవ్వండి
- మా పిల్లలకు సీబీఎస్ఈ బోధన చేయాలి
- సింగరేణి కార్మికుల డిమాండ్



గోదావరిఖని: రాష్ట్రంలోనే ఎన్నికల దిశానిర్దేశం చేసే సత్తా ఉన్న సింగరేణి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదు జిల్లాల్లోని 11అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణి కార్మికులు ఉన్నారు. సంస్థలో 42వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. రామగుండం, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, సత్తుపల్లి నియోజకవర్గాల్లో సింగరేణి గనులు విస్తరించి ఉన్నాయి. ఈక్రమంలో వీరిఓట్లు కీలకంగా మారనున్నాయి. తమ ప్రధాన డిమాండ్లను రాజకీయ పార్టీలు పట్టించుకోవాలని కోరుతున్నాయి. ప్రకృతికి విరుద్ధంగా బొగ్గు గనుల్లోకి వెళ్లి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఉత్పత్తి చేసి దేశానికి వెలుగులు అందిస్తున్న బొగ్గు గని కార్మికులను దేశ సరిహద్దుల్లోని సైనికులతో సమానంగా చూస్తామని రాజకీయ పార్టీలు అనేక సందర్భాల్లో హామీ ఇచ్చాయి. కానీ ఇప్పటికీ ఆ కల నెరవేరలేదు. ఏడాదిలో రూ.లక్షల కొద్దీ ఇన్‌కంటాక్స్ చెల్లింపులకే సరిపోతోందని వాపోతున్నారు. అలాగే మారుపేర్ల మార్పు కోసం చాలా మంది కార్మికులు, డిపెండెంట్లు ఎదురుచూస్తున్నారు. మరో ఆరు రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్మికులు ప్రధాన డిమాండ్లను రాజకీయ పార్టీల ముందు ఉంచుతున్నారు.

ప్రధాన డిమాండ్లివే..

- 200 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించాలి లేదా క్వార్టర్ పర్మినెంట్‌గా ఇవ్వాలి
- సంస్థలో పనిచేస్తున్న వారికి ఇన్‌కంటాక్స్ మినహాయించాలి
- కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ విధానంలో విద్య బోధించాలి
- కార్మికుల మారుపేర్ల సమస్య పరిష్కరించాలి
- హెల్త్ ఎమర్జెన్సీ రెఫరల్ ఆన్‌లైన్‌లో క్షణాల్లో కార్పొరేట్ వైద్యం అందేలా చూడాలి
- అన్నివ్యాధులకు సీపీఆర్ఎంఎస్ కార్డు వర్తించేలా చూడాలి
- అన్ని ఏరియాల్లో జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, స్కానింగ్ డాక్టర్లు ఉండాలి
- పేషెంట్లు, ఆస్పత్రి సిబ్బందికి విశ్రాంతి గదితోపాటు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి
- అధికారులకు ఇస్తున్న విధంగా సీపీఆర్ఎంఎస్ రూ.25లక్షలు కార్మికులకు చెల్లించాలి
- రిటైర్డ్ కార్మికులకు ఏరియా ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించాలి
- సంస్థ నిధులు కేటాయిస్తున్నప్పటికీ కార్మికవాడల్లో మున్సిపాల్టీ సౌకర్యాలు కల్పించడం లేదు. యాజమాన్యం చొరవ తీసుకోవాలి
- కార్మికుల వారసుల వయోపరిమితి 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంచాలి
- అధికారుల మాదిరిగా గ్రాట్యుటీ సీలింగ్ కార్మికులకు అమలు చేయాలి
- తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో మెడికల్ బోర్డుకు వెళ్లి ఫిట్ అయిన వారికి తిరిగి మెడికల్ అవకాశం కల్పించాలి.

ప్రణాళికాబద్ధంగా ఈవీఎంల కమిషనింగ్



ఈవీఎంల కమిషనింగ్ పూర్తి చేస్తున్న అధికారులు

- సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా

గోదావరిఖని: ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా ఆదేశించారు. గురువారం ఈవీఎంల కమిషనింగ్ కొనసాగింది. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టారు. సెక్టార్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ర్యాండమైజేషన్ చేసిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగిందని ఆయన తెలిపారు. ఈనెల 30న జరిగే పోలింగ్ కోసం ఈవీఎంను మూడు విభాగాలు విభజించామని అన్నారు. బీయూ, సీయూ, వీవీపాట్‌లను అమర్చడం, అనుసంధానం చేయడం, మాక్ పోలింగ్, అనంతరం స్విచ్ ఆఫ్, ఆన్ చేయడం తదితర ముఖ్యమైన కమిషనింగ్ ప్రక్రియ మొత్తాన్ని ఈసీఐఎల్ ఇంజినీర్లు, మాస్టర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో కొనసాగించామని వివరించారు. పోలింగ్ కేంద్రాల వరుస సంఖ్య, ఈవీఎంల వరుస సంఖ్యలను అనుసంధానం చేస్తూ పూర్తిస్థాయి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేశామని చెప్పారు. అభ్యర్థులు, వారి పోలింగ్ ఏజెంట్‌ల సమక్షంలో ప్రతిపాదనను అనుసరించి డ్రాపద్ధతిన ఎంచుకున్న వరుస సంఖ్యల ప్రకారం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ కొనసాగిందన్నారు. కార్యక్రమంలో రామగుండం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, ఈవీఎంల నోడల్ అధికారి రామ్మోహన్‌రావు, ఏఆర్‌వో కుమారస్వామి, మాస్టర్ ట్రైనర్స్, ఈసీఐఎల్ ఇంజినీర్‌లు, అధికారులు, సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మహిళా హక్కుల రక్షణకు చర్యలు



మాట్లాడుతున్న కవిత

సుల్తానాబాద్‌రూరల్: మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణ కోసం హెల్ప్‌లైన్ 1098ను వినియోగించుకోవాలని మహిళా సాధికారిత కేంద్రం ప్రతినిధులు కోరారు. గర్రెపల్లి మోడల్ స్కూల్‌లో గురువారం మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బాలికలకు హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ చర్యలు, హక్కులపై వివరించారు. ఉన్నత చదువులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు అందిస్తుందని, సంక్షేమ పథకాలను వినియోగించుకోవచ్చని తెలిపారు. సీడీపీవో కవిత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భిక్షం, కో ఆర్డినేటర్ దయాఅరుణ, జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్ఞాపకం

గిరిజనులతో ఎన్టీఆర్ సహపంక్తి భోజనం

మంథని: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 1986మే 21న ముఖ్యమంత్రి హోదాలో మంథని నియోజకవర్గ పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో మహాముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామ గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆ విషయాన్ని అడవిబిడ్డలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. గిరిజన ప్రాంతంలో పట్టు సాధించాలనే లక్ష్యంతో గిరిజనులతో కలిసి జొన్నరొట్టె, ఇప్పపువ్వు కుడుములు తిన్నారట. ఈ ప్రాంతానికి హెలిక్యాప్టర్ ద్వారా ఎన్టీఆర్ రావడంతో గిరిజనులు దానికి తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి ఎన్టీఆర్ ఈ ప్రాంతానికి వచ్చినా కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఆనాడు చెక్కు చెదరలేదు.

గేట్ పడితే తిప్పలే !

- గౌతమినగర్ రైల్వే గేట్ వద్ద నిత్యం ఇవే ఇబ్బందులు
- ఫ్లై ఓవర్ లేక గంటల తరబడి జనాలకు తప్పని నిరీక్షణ
- బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి



ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్ – గౌతమినగర్ మధ్య ప్రజా రవాణాకు ఆటంకంగా మారిన రైల్వేగేట్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లోని గౌతమినగర్‌లో రైల్వేగేట్‌తో ప్రభావిత 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలైన్‌లు ఆధునికీకరించడంతో సింగరేణి, రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియా రైల్వే వ్యాగన్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. రోజూ వందల సంఖ్యలో గూడ్స్ రైళ్లు వెళ్తుండడంతో గౌతమినగర్ రైల్వేగేట్ వద్ద ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో, అంబులెన్స్ వెళ్లే సమయంలో గేటుమూసి ఉండడంతో ప్రాణాలు గాల్లో కలిసే అవకాశం లేకపోలేదు. రైల్వేగేట్ వద్ద ఫ్లైఓవర్, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రయాణం సులభతరమవుతుంది. ప్రజాప్రతినిధులు స్పందించి గౌతమినగర్‌లో బ్రిడ్జి నిర్మించేలా కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

గంటల తరబడి నిరీక్షణ..

చుట్టుపక్కల 20 గ్రామాల ప్రజలు, ఎల్కలపల్లి గేట్ వాసులు గోదావరిఖని, రామగుండం రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే గౌతమినగర్ రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సి ఉంటుంది. అయితే రైల్వేగేట్ వద్ద ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి, ఎన్టీపీసీ, గూడ్స్ రైళ్లు నిత్యం నడుస్తుంటాయి. ఈక్రమంలో గేట్ పడిన సమయంలో గంటల తరబడి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన రైళ్ల సంఖ్య..

ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో సామర్థ్యం మేర యూరియా ఉత్పత్తి చేయడంతో రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రైలు మార్గాల ద్వారా యూరియాను సరఫరా చేస్తున్నారు. సింగరేణి గనుల్లో ఉత్పత్తి చేసిన బొగ్గును తరలించేందుకు సీహెచ్‌పీ నుంచి వివిధ రాష్ట్రాలకు సరఫరా చేసేందుకు ప్రధాన రైలు మార్గం కావడంతో నిత్యం పదుల సంఖ్యలో గూడ్స్ రైళ్లు వెళ్తున్నాయి. వీటి ద్వారా ఇప్పటికే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఫ్లై ఓవర్ వంతెనలతో ప్రయాణం సులభం..

గౌతమినగర్‌లో ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రయాణం సులభతరం అవుతుంది. యైటింక్లయిన్‌కాలనీ నుంచి వచ్చే సింగరేణి ప్రాంత ప్రజల ఇబ్బందులు తప్పుతాయి. ఫైఓ ఓవర్ గ్రౌండ్ నిర్మాణాలతో సమయంతో పాటు దూరభారం కూడా తగ్గుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్స్ ఫ్యాక్టరీ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫ్లై ఓవర్ నిర్మించాలి



గౌతమినగర్ రైల్వే గేట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తే ప్రయాణికుల ఇక్కట్లు తొలగుతాయి. ఆర్ఎఫ్‌సీఎల్ ప్రారంభంతో నిత్యం పదుల సంఖ్యలో రైళ్ల ప్రయాణం సాగిస్తున్నాయి. వీటికి తోడు సింగరేణి బొగ్గు రైళ్లు కూడా తోడవడంతో ప్రతీ ఇరవై నిమిషాలకోసారి గేటు వద్ద వేచి చూడాల్సి వస్తోంది.

– బల్ల నాగరాజు, లక్ష్మీపురం కొత్తగేట్

అధికారులు చొరవచూపాలి



రైల్వే గేట్ వద్ద ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై అధికారులు దృష్టి సారించాలి. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి రైల్వే ఫ్లైఓవర్ నిర్మించేలా చూడాలి. ప్రయాణికుల ఇబ్బంది తీర్చాలి.

– దబ్బేట భానుచందర్, ఎల్కలపల్లి

భద్రత, నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట



సమావేశానికి హాజరైన వెండర్లు, అధికారులు

- ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం కేదార్ రంజన్ పాండు



మాట్లాడుతున్న సీజీఎం కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): భద్రత, నాణ్యత ప్రమాణాలకు ఎన్టీపీసీ పెద్దపీట వేస్తుందని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. స్థానిక ప్రాజెక్టు పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ–మహిళల (సూక్ష్మ, చిన్న – మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ) కోసం గురువారం స్పెషల్ వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వెండర్ మీట్ – 2023 ఏర్పాటు చేశారు. సీజీఎం ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జెమ్ పోర్టల్‌ను ప్రారంభించినప్పటి నుంచి పలు వివరాలను వెల్లడించారు. సంస్థలో పెరుగుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఐసీ బ్రాంచి మేనేజర్ కౌశిక్, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ దశరథ్ వర్చువల్ విధానంలో పాలసీల గురించి వివరించారు. కరీంనగర్‌లోని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నుంచి శైలజ పాల్గొని తన సొంత వ్యాపారం కొనసాగింపు, వ్యాపారం చేయడం కోసం అందుబాటులో ఉన్న విభిన్న వస్తువుల గురించి వివరించారు. సీ అండ్ ఎం విభాగం డీజీఎం విక్రమ్ పాండే పీపీటీ ద్వారా విక్రేతల ఒప్పందాలు, కొనుగోలు ప్రక్రియలతోపాటు వెండర్ చెల్లింపు పోర్టల్ పనితీరుపై అవగాహన కల్పించారు. వెండర్స్ వివిధ ప్రశ్నలకు అధికారులు సమాధానాలు తెలియజేసి వాటిపై సమగ్రంగా వివరించారు. సమావేశంలో ఎన్టీపీసీ అధికారులు, వెండర్స్ పాల్గొన్నారు.

ఓట్ల కోసం వచ్చేవారిని నిలదీయండి



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి

జ్యోతినగర్(రామగుండం): ఓట్ల కోసం వచ్చే నాయకులను కార్మికరంగ సమస్యలపైన నిలదీయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడుఉ గుజ్జుల సత్యనారాయణరెడ్డి కోరారు. ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలక పార్టీలు కార్మిక రంగంపై ఉక్కు పాదం మోపుతున్నాయన్నారు. ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తామన్న హామీని బీఆర్ఎస్ ప్రభుత్వం మరిచిపోయిందని ఆరోపించారు. ఎన్టీపీసీ కాంట్రాక్ట్ పనుల్లో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, కాంట్రాక్టర్లు పనులు అమ్ముకుంటూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఇది ఆర్ఎఫ్‌సీఎల్ కుంభకోణం మాదిరిగా తయారవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు లేక, సమయానికి జీతాలు రాక, పనిభద్రత లేకుండా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరిగిన ధరలతో కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఈ సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మార్త రామన్న, చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన ఏడాదికే యువతి ఆత్మహత్య

- డబ్బు కోసం భర్త వేధింపులే కారణం


మానస (ఫైల్)

మానకొండూర్ రూరల్: ఓ యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వివరాల ప్రకారం పచ్చునూర్ గ్రామానికి చెందిన మానస (25)కు గట్టుదుద్దెనపల్లికి చెందిన పప్పు సంపత్‌తో ఏడాది క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. కానీ, ఆరు నెలలకే అదనంగా డబ్బులు తీసుకురావాలంటూ భర్త ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. దీపావళికి మానస తల్లిగారింటికి వచ్చింది. భర్త డబ్బులు కావాలని వేధిస్తున్నాడని తల్లిదండ్రులతో చెప్పింది. పండుగ మరుసటి రోజు సంపత్ పచ్చునూర్ వచ్చి, డబ్బులివ్వాలని గొడవపడి వెళ్లిపోయాడు. అప్పటినుంచి మానస పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయం చూసి, బయటకు వెళ్లిపోయింది. గురువారం తల్లిదండ్రులు వెతకగా గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో మానస మృతదేహం కనిపించింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు మృతి

వీర్నపల్లి(సిరిసిల్ల): తండ్రి మరణాన్ని తట్టుకోలేక మనోవేదనతో కొడుకు మృతిచెందిన సంఘటన మండలంలోని భూక్యతండాలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. భూక్య శంకర్(48) తన కొడుకు ఆరోగ్యం బాగు చేయించేందుకు రూ.10 లక్షల వరకు అప్పులు చేసి.. వాటిని తీర్చే మార్గం కనిపించక గత వారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తండ్రి మరణించినప్పటి నుంచి కొడుకు లింగమూర్తి(36) మానసిక వేదనకు గురవుతున్నాడు. తండ్రి లేని లోటు తాను భరించలేనని గురువారం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. వారం రోజుల వ్యవధిలో తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. మృతుడికి తల్లి రేణ, భార్య కవిత, కూతురు అశ్విత, కొడుకు వంశీ ఉన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ కోరారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం పోలీసు శాఖ శాంతియుత వాతావరణం కల్పిస్తుందని తెలిపారు. ఈమేరకు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టూటౌన్ పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పదవులు రాగానే పార్టీలు మారుతున్నారు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్టమధు

మంథని: రాజకీయంగా ప్రోత్సాహం అందించి ఎంతో మందికి పదవులు ఇచ్చి గౌరవిస్తే డబ్బుల కోసం పార్టీలు మారి మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు విమర్శించారు. విలోచవరం, పోతారం, ఉప్పట్లలో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీసీలు, ఎస్సీలు ఎదగాలని పదవులు ఇస్తే డబ్బుల కోసం మోసం చేశారన్నారు. విలోచవరం గ్రామానికి చెందిన ఓ నాయకుడిని ఆదరిస్తే గ్రామంలో అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు. స్వప్రయోజనాల కోసం పార్టీలు మారేవారి గురించి ప్రజలు ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే గొల్లపల్లి నుంచి ముకునూరు వరకు అభివృద్ధి పనులు చేయని గ్రామం లేదన్నారు. పోతారం, విలోచవరం, ఉప్పట్ల గ్రామాల ప్రజలు ఏళ్లుగా గంగరోడ్డు కోసం ఎదురుచూశారని, అప్పటి మంత్రి గంగరోడ్డు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గంగరోడ్డు, గ్రామాల్లో సీసీరోడ్లు వేసినట్లు గుర్తు చేశారు.

సమాజ్‌వాదీ పార్టీ సంపూర్ణ మద్దతు

పుట్టమధును నియోజకవర్గ ప్రజలు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపింకోవాలని సమాజ్ వాద్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పుట్టమధుకు సమాజ్‌వాద్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పెద్దపల్లి మండల అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ జులపల్లి మండలాధ్యక్షుడు మారం వెంకటరమణ ఎండీ సర్వర్లు పాల్గొన్నారు.

పుట్ట మధును ఆశీర్వదించాలి

కమాన్‌పూర్(మంథని): బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధును ఆశీర్వదించాలని బహుజన సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు యాదవ్ కోరారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నాయకులు నల్లవెల్లి శంకర్, పిల్లి శేఖర్, విజ్జగిరి సమ్మయ్య, కుక్క చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాటారం: మున్నూరుకాపు కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. బుధవారం రాత్రి మండలకేంద్రంలోని ఏవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో మున్నూరుకాపు సంఘం నాయకులు తోట కోటేశ్వర్, దబ్బెట రాజేశ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మున్నూరుకాపు కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. రూ.50 లక్షలతో మున్నూరుకాపు సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరిస్తానని పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన చీమల పోచయ్యపటేల్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు రాజయ్య, వెంకటస్వామి భవన నిర్మాణానికి 15 గుంటల భూమి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, జిల్లా అధ్యక్షుడు దబ్బెట మహేశ్, పెండ్యాల్ సంపత్, కవ్వాల శేఖర్, తోట జనార్దన్, చీమల వంశీ, కొట్టె రాజేశం, గట్టు రమేశ్, బాసాని పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

పలిమెల: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుమ్మరి సుధాకర్, కాంగ్రెస్ పార్టీకి చెందిన రమేశ్, తొర్రెమ్ భిక్షపతి, కుమ్మరి నారాయణ బీఆర్ఎస్‌లో చేరగా వారిని పుట్టమధు పార్టీలోకి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న తిరుపతి యాదవ్


కారు గుర్తుకు ఓటేయ్యమని అమ్మ నాన్నకు చెప్పాలని చిన్నారిని అభ్యర్థిస్తున్న మధు

ఉచిత కరెంట్ ఇచ్చింది కాంగ్రెస్సే

ఆరు గ్యారంటీలతో పేదోడికి అండ

- ఏడాదిలో 2లక్షల ఉద్యోగాల భర్తీ
- మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు


మల్హర్: నాచారం ఎన్నికల ప్రచారంలో శ్రీధర్‌బాబు, నాయకులు

మల్హర్: రైతులకు మెరుగైన కరెంట్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దేనని మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అన్సాన్‌పల్లి, నాచారం, రుద్రారం, ఎడ్లపల్లి, కొండంపేట, వల్లెకుంట గ్రామాల్లో గురువారం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. రైతులకు ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే అందించిందన్నారు. కరెంట్ సమస్యలు రాకూడదని ఉద్దేశంతో జైపూర్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు భూపాలపల్లి థర్మల్ పవర్ స్టేషన్ విభజన చట్టంలో క్రిటికల్ అలీ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి సబ్సిడీలూ అందలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సబ్సిడీలు అందజేస్తామని తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తామని హామీఇచ్చారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పేదవాడికి అండగా ఉంటామని శ్రీధర్‌బాబు చెప్పారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఆడపడుచులు పడుతున్న బాధలను చూసిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఇంటింటికీ చేరవేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఈ పథకాలు అమలు చేస్తామని చెప్పారు.

2లక్షల ఉద్యోగాల భర్తీ..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు. మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. ప్రతి ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17లోపు నియామకాలు పూర్తి చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే వరకు ప్రతీ నెల రూ.4వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పారు. ప్రత్యేక చట్టంతో టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో పునరుద్ధరణ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, మాజీ ఎంపీపీ ఇసనపు రవి, అన్సాన్‌పల్లి సర్పంచ్ జగన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మల్హర్: నాచారంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు


మహాముత్తారం: కిషన్‌నాయక్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న శ్రీధర్‌బాబు

పేద ప్రజల పార్టీ కాంగ్రెస్

మహాముత్తారం: పేదప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్‌పార్టీ పాటు పడుతుందని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మహాముత్తారం మండలంలోని పర్లపల్లి, జీలపల్లి, మాదారం, శ్రీపాదకాలనీ, లంబాడిపల్లి, కొర్లకుంట గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు, కార్నర్ మీటింగ్‌లో శ్రీనుబాబు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకోసం పనిచేస్తుందని చెప్పారు. గిరిజనులకు, గిరిజనేతరులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గిరిజనులకు, గిరిజనేతరులకు మళ్లీ మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. విజయం సాధించిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. చేయి గుర్తుపై ఓటువేసి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల క్యాంపనింగ్ రాష్ట్ర సెక్రటరీ ఇనుగొండ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ శారద, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ కిషన్‌నాయక్

మహాముత్తారం మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బానోత్ కిషన్‌నాయక్ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మల్హర్ జెడ్పీటీసీ కోమల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడికెల రాజయ్య, వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

పోస్టర్‌కు పేపర్ అతికించిన సిబ్బంది



రాయికల్: పట్టణంలోని ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం వద్ద ప్రధాని మోడీ ఉన్న పోస్టర్‌కు గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సభ్యులు పేపర్ అతికించారు. ఎన్నికల కోడ్ పూర్తయ్యేంతవరకు పోస్టర్ల అతికించవద్దని ఆదేశించారు.

భార్య మాట వినలేదని భర్త ఆత్మహత్య

- అనంతపల్లిలో విషాదం


బాబు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): తన మాట భార్య వినలేదని మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనంతపల్లిలో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. అనంతపల్లికి చెందిన బైరి బాబు(48)–లత దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్నకూతురు అదే గ్రామానికి చెందిన యువకుడిని ఏడాదిన్నర క్రితం ప్రేమవివాహం చేసుకుంది. దీంతో చిన్నకూతురిని మరిచిపోదామని ఆ దంపతులు నిశ్చయించుకున్నారు. అయితే చిన్నకూతురుకు గురువారం పాప పుట్టింది. ఈ విషయం తెలుసుకున్న బాబు భార్య లత ఆస్పత్రికి వెళ్లి చూసి వచ్చింది. ఈ విషయం తెలిసిన బాబు మనస్థాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరివేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి తీవ్ర గాయాలు

వీణవంక(హుజూరాబాద్): జమ్మికుంటలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ సభకు వెళ్లి, తిరిగి వస్తుండగా వీణవంకకు చెందిన దానవేన స్వరూప ట్రాక్టర్ పైనుంచి పడటంతో తీవ్రంగా గాయపడింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. స్వరూపతోపాటు కొందరు ట్రాక్టర్‌లో సభకు వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు ఆమె ట్రాక్టర్ ఇంజిన్ వద్ద కూర్చుంది. వల్భాపూర్ సమీపంలోని కెనాల్ వద్దకు రాగానే ప్రమాదవశాత్తు రోడ్డుపై పడింది. ఈ ఘటనలో స్వరూప తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పోలింగ్ అధికారులకు ఈసీ సూచన

జగిత్యాలజోన్ : ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, పోలింగ్ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం పలు సూచనలు చేసింది. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఏ పార్టీకాని, అభ్యర్థి గాని ప్రచారం చేయరాదు. కేంద్రానికి వందమీటర్ల పరిధిలో వివిధ పార్టీల బ్యానర్లు, జెండాలు, గోడల మీద రాతలు, పోస్టర్లు లేకుండా చూడాలి. పోలింగ్ బూత్‌లో దేశ నాయకుల చిత్రపటాలు ఉంచొద్దు. అభ్యర్థుల జాబితా గుర్తులున్న పోస్టర్‌ను బూత్ ముందు ఓటర్లకు కనిపించేలా అతికించాలి. గదిలో సరైన వెలుతురు ఉండేలా చూడాలి. పోలింగ్ బూత్‌లోకి ఏజెంట్లు, సిబ్బంది, సెల్‌ఫోన్లు, వైర్‌లెస్, కార్డ్ లెస్ ఫోన్లు, వీడియో కెమెరాలు తీసుకెళ్లకూడదు. సంబంధం లేని వ్యక్తులను పోలింగ్‌స్టేషన్‌లోకి అనుమతించరు. అధికారులు ఓటు వేసేటప్పుడు ఓటింగ్ గదిలోకి వెళ్లరాదు. ప్రతి రెండు గంటలకోసారి అప్పటి వరకు పోలైన ఓట్ల వివరాలను జోనల్ ఆఫీసర్‌కు తెలపాలి. ఏజెంట్లు బూత్‌లో కూర్చుండే విషయంలోనూ తొలుత జాతీయ పార్టీ, తర్వాత రాష్ట్ర పార్టీ, అనంతరం స్వతంత్రులకు వరుసగా అవకాశం కల్పిస్తారు. పార్టీలకు సంబంధించిన దుస్తులు, టోపీలు, బ్యాడ్జీలు, కండువాలను తీసుకెళ్లవద్దు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాచర్లగొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు ద్విచక్ర వాహనంపై వస్తున్న అక్కపల్లికి చెందిన రాజును ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రాజును స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తంగళ్లపల్లిలో..


గాయపడిన రాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో గురువారం బైక్, మారుతి ఈకో వాహనం ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాజు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని సిరిసిల్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


జల (ఫైల్)

మేడిపల్లి : భీమారం మండలంలోని కమ్మరిపేటలో అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జవ్వాజి జల (32) బుధవారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించింది. తెల్లవారుజామున కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికారు. ఇంటి సమీపంలోని పాడుబడ్డ బావి వద్ద చేతికర్ర తో పాటు పొగ వ్యాపించడాన్ని గమనించారు. మంటలు ఆర్పివేయడంతో కాలిన శరీరం ఆనవాళ్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శ్యామ్‌రాజ్, కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి చేరుకొని, ఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహించారు. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించగా కుంచెపు మహేశ్ ద్విచక్ర వాహనంపై 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశామని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో గట్టయ్య, మోహన్‌లాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి.. పోలీసులు వచ్చారని

- త్రుటిలో తప్పించుకున్న ఆగంతకుడు


ఆగంతకుడి కోసం వెతుకుతున్న పోలీసులు

ధర్మపురి: చోరీకి యత్నించిన ఓ ఆగంతకుడు పోలీసుల అలికిడి విని త్రుటిలో తప్పించుకుపోయిన ఘటన గురువారం ధర్మపురిలో చోటు చేసుకుంది. పట్టణంలోని కోనేరు వెనుకభాగంలో బ్రాహ్మణ వీధిలో విశ్రాంత ఉపాధ్యాయుడు పెండాల రవికుమార్ రాజశ్రీ దంపతులు నివాసముంటున్నారు. గురువారం ఉదయం రవికుమార్ సమీపంలోని ఆలయానికి ఆలయానికి వెళ్లాడు. రాజశ్రీ కూరగాయల మార్కెట్‌కు వెళ్లింది. అదే సమయంలో ఓ వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి సామగ్రి సర్దుతున్నాడు. రాజశ్రీ ఇంటికి రాగా లోపల గడియపెట్టి ఉండడాన్ని గమనించింది. విషయాన్ని చుట్టుపక్కల వాళ్లకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ చేరుకున్నారు. పోలీసులు వచ్చిన విషయాన్ని గమనించిన ఆగంతకుడు వెనుకడోర్ నుంచి పరారాయ్యాడు. నిత్యం జన సంచారముండే బ్రాహ్మణ వీధిలో చోరీకి యత్నించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

రేపు వేములవాడకు రాహుల్ గాంధీ రాక

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్‌గాంధీ ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు వేములవాడకు వస్తున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ గురువారం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, నియోజకవర్గప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

వాహనాల తనిఖీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు, స్పెషల్ యాక్షన్ టీంల ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, త్రీ టౌన్ సీఐ శ్రీనివాస్, వన్ టౌన్ సీఐ రవికుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.